# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 11, డిసెంబర్ 2025


మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలను

## ప్రశాంతంగా పూర్తి చేయాలి

* నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ పట్టణం, డిసెంబర్ 10, ప్రభాతవార్త**

మొదటి దశ గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం ఖానాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని, జిల్లా ఎస్పీ జానకిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అందరూ ప్రశాంతంగా ఉండి, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ కొరకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని అన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో ఓపికగా ఉండాలని మిగతా 2లో..



అర్హత గల ప్రతి ఒక్కరూ


## ఓటు హక్కు వినియోగించుకోవాలి

* మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**లక్షెట్టిపేట, డిసెంబర్ 10, ప్రభాతవార్త**

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో జరగనున్న పోలింగ్‌లో అర్హత గల ప్రతి ఒక్కరూ తమ ఓటింగ్ హక్కు వినియోగించుకోవాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల, దండేపల్లి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హాజీపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్యతో కలిసి లక్షెట్టిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మొదటి విడత ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ ఎన్నికలు మిగతా 2లో..





## ప్రశాంతంగా 100 శాతం పోలింగ్ జరగాలి

**ఇచ్చోడ, డిసెంబర్ 10, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రిటర్నింగ్ ఆఫీసర్లకు, పిఓలకు, ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఏమైనా సందేహాలు ఉంటే ఇక్కడ ఉన్న మాస్టర్ ట్రైనర్లు మీ సందేహాలను నివృత్తి చేస్తారు. ఈసారి ప్రశాంతంగా, 100 శాతం పోలింగ్ జరగాలని తెలిపారు. ఈ ఎన్నికల విధులు నిర్వహించబోతున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, ఎంపీడీవో నాగమ్ నరేష్, రామారావు, ఇన్చార్జి ఎమ్మార్వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ సిబ్బందికి పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలి

* జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**కెరమెరి, డిసెంబర్ 10, ప్రభాతవార్త :**

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని కెరమెరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ కొరకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహణ పర్యవేక్షించాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో సరిపడా కుర్చీలు, టేబుల్లు, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని, మరోసారి బ్యాలెట్ పేపర్లను సరి చూసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద వరుస క్రమంలో వచ్చేలా క్యూ లైన్లు పాటించాలని, పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు, అభ్యర్థుల ఏజెంట్లు తప్ప ఇతర వ్యక్తులు ఉండకూడదని, పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపు ప్రజలు గుంపులుగా ఉండకూడదని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి సమయానికి టీ, అల్పాహారం, భోజనం అందించే విధంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ అనంతరం మిగతా 2లో..

## పోలింగ్ కేంద్రాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

* మంచిర్యాల జిల్లా డిఎంహెచ్ఓ అనిత

**తాండూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :**

గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ రోజున వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని మంచిర్యాల జిల్లా డిఎం అండ్ హెచ్ ఓ అనిత ఆదేశించారు. స్థానిక పీహెచ్సీని బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యాధికారి, సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలలో నియమించిన వైద్య సిబ్బంది ఉదయం 6 గంటలకి రిపోర్టు చేసి కౌంటింగ్ మిగతా 2లో..



## మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలను

# ప్రశాంతంగా పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. అన్ని ఫారములను తప్పులు లేకుండా పూరిస్తూ, ఓటింగ్ సరళి వివరాలను పంపాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియలు పారదర్శకంగా చేపట్టాలని అన్నారు. కౌంటర్ల వారీగా తిరుగుతూ, అన్ని పోలింగ్ ప్రతులు, ఫారములు, ఇతర ఎన్నికల సామాగ్రి ఆయా రూట్ల, పోలింగ్ కేంద్రాల వారిగా అందయో లేదో ఎన్నికల విధులు నిర్వహించబోయే అధికారులను అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు సమయానికి భోజనం అందించాలని అన్నారు..జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలను తీసుకున్నామని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ పరిశీలనలో మండల ప్రత్యేక అధికారి (సిపిఓ) జీవరత్నం, డీఈవో భోజన్న, తహసిల్దార్ సుజాత, ఎంపీడీఓ రమాకాంత్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

ముగిసే వరకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో యూనిఫామ్ లో ఉండాలని మొబైల్ ఫోన్లను తీసుకువెళ్ళొద్దని, స్థానిక ప్రజా ప్రతినిధులతో దూరంగా ఉండాలని ఎన్నికల కోడ్ నిబంధనాలను పాటించాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, గర్భవతుల నమోదు, టీకాలు అసంక్రమణ వ్యాధులు, కీటక జనిత వ్యాధుల నివారణ పైన దృష్టి పెట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితిలో 108 వాహనం సేవలను వినియోగించుకోవాలన్నారు వ్యాక్సిన్ మందుల నిల్వలను పరిశీలించారు. సమావేశంలో డాక్టర్ ఝాన్సీ, డిపిఓ ప్రశాంతి సిహెచ్ఓ వెంకటేశ్వర్లు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ సిబ్బందికి పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అంతకుముందు కెరమెరి మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది తరలింపు పై మండల పరిషత్ అభివృద్ధి అధికారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్, ఉప సర్పంచ్ ఎన్నిక జరిగే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, జోనల్ అధికారులు, స్టేజ్ 2 ఆర్. ఓ. లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా కస్తూరి నాగేశ్వర్

నస్పూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైన విశ్రాంత వ్యవసాయ విస్తరణ అధికారి కస్తూరి నాగేశ్వర్‌ను మంచిర్యాల కలెక్టరేట్ ఏరియా వాకర్స్ హెల్త్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. కస్తూరి నాగేశ్వర్ ప్రస్తుతం కలెక్టరేట్ ఏరియా వాకర్స్ హెల్త్ క్లబ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు. బుధవారం ఉదయం వాకింగ్ అనంతరం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాకర్స్ హెల్త్ క్లబ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గుండేటి యోగేశ్వర్ ఆధ్వర్యంలో నాగేశ్వర్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా యోగేశ్వర్ మాట్లాడుతూ.. నాగేశ్వర్ నిగర్వి అని, నిత్యం వ్యాయామం చేస్తూ అందరితో ఎంతో కలివిడిగా ఉంటారని కొనియాడారు. ఆయన తన సేవా గుణంతో భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, సంపత్ కుమార్, శ్యాంసుందర్, జి. వెంకటేశం, అక్కల రమేష్, సాయి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొని నాగేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.



కస్తూరి నాగేశ్వర్ సన్మానిస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యులు

## అర్హత గల ప్రతి ఒక్కరూ

# ఓటు హక్కు వినియోగించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

పకడ్బందీగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఓటింగ్, కౌంటింగ్ కొరకు అవసరమైన సామాగ్రి పంపిణీ చేయడంతో పాటు ఎన్నికల అధికారులు, సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. మొదటి విడతలో భాగంగా ఈ నెల 11వ తేదీన జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలలో ఏకగ్రీవం అయిన స్థానాలను మినహాయించి మిగిలిన 81 గ్రామపంచాయతీ సర్పంచ్, 514 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 2 వేల 600 మంది పోలింగ్ విధులు, 400 పోలీస్ సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారని, 24 వెబ్ కాస్టింగ్ లొకేషన్ల ద్వారా 200 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహణ ఉంటుందని, 20 మంది సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థుల ప్రచారం ముగిసిందని, ఈ నెల 11వ తేదీన ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరూ నిర్భయంగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కు వినియోగించాలని, గత ఎన్నికలలో 85.26 శాతం ఓటింగ్ నమోదు అయిందని, ఈసారి 90 శాతం నమోదు జరిగేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మీడియా ప్రతినిధులు అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకమైన ఎన్నికలు జరిగేలా అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

- ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- ఘనంగా సింగరేణి సేవా సమితి 25వ ఆవిర్భావ వేడుకలు
- శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

నస్పూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త

మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడి, ఆర్థిక స్వావలంబన సాధించడమే సింగరేణి సేవా సమితి ముఖ్య ఉద్దేశమని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. సింగరేణి సేవా సమితి 25వ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని ప్రగతి స్టేడియంలోని సిఈఆర్ క్లబ్‌లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-ఖ26 ఆర్థిక సంవత్సరానికి గాను సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వృత్తి శిక్షణ తరగతులను (టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్) జీఎం శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు మునిగంటి ఉమరాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. శ్రీరాంపూర్ ఏరియాలో ఇప్పటికే అనేకమంది మహిళలు సేవా సమితి ద్వారా ఉచిత శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందుతుండటం సంతోషకరమన్నారు. మహిళలు ఈ కోర్సులను నేర్చుకోవడంతో సరిపెట్టుకోకుండా, నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని, తద్వారా తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని ఆకాంక్షించారు.

### ఆసక్తి ఉంటే మరిన్ని కొత్త కోర్సులు..

సేవా అధ్యక్షురాలు మునిగంటి ఉమరాణి మాట్లాడుతూ.. శ్రీరాంపూర్ ఏరియాలో వృత్తి నైపుణ్యాలు నేర్చుకోవాలనే ఆసక్తి గల మహిళలు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా హాజరై మెలకువలను నేర్చుకోవాలని సూచించారు. మహిళలు ఆసక్తి చూపితే భవిష్యత్తులో మరిన్ని నూతన కోర్సులను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, సీనియర్ పీవో ఎస్. సురేందర్, సేవా సెక్రటరీ కొట్టే జ్యోతి, శిక్షకులు, సేవా సభ్యులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతే సింగరేణి ప్రథమ ప్రాధాన్యం

- డిజిటల్ హెల్త్ రికార్డులతో వైద్య సేవల్లో పారదర్శకత
- శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

నస్పూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతకే తాము అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. 56వ రక్షణ పక్షోత్సవాలలో భాగంగా బుధవారం నస్పూర్ డిస్పెన్సరీలో ఏర్పాటు చేసిన వార్షిక రక్షణ పక్షోత్సవాల వేడుకలను ఆయన రక్షణ వారోత్సవాల ఇన్స్పెక్షన్ కమిటీ కన్వీనర్, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ పి. రమేష్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. వృత్తి సంబంధిత అనారోగ్య సమస్యలను పరిష్కరించడంలోనూ, సకాలంలో వైద్య సేవలు అందించడంలోనూ డిస్పెన్సరీ వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని కొనియాడారు. సాంకేతికతను వినియోగించుకుంటూ ప్రతి ఉద్యోగి ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్ హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. డిజిటల్ హెల్త్ రికార్డుల లభ్యత వల్ల ఉద్యోగుల ఆరోగ్య పర్యవేక్షణ, వైద్య పరీక్షలు, నివేదికల జారీ ప్రక్రియ మరింత వేగంగా, పారదర్శకంగా జరుగుతోందని వివరించారు.

### అవగాహనే రక్షణకు ఆయుధం..

అనంతరం ఇన్స్పెక్షన్ కమిటీ కన్వీనర్ డాక్టర్ పి. రమేష్ బాబు మాట్లాడుతూ.. రక్షణ వారోత్సవాల ప్రధాన ఉద్దేశం కేవలం వేడుకలు జరపడం కాదని, ఉద్యోగుల్లో ఆరోగ్య స్పృహను పెంచడమేనని తెలిపారు. వృత్తి సంబంధిత ప్రమాదాలను నివారించడం, గనుల్లో భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడం మనందరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు ప్రథమ చికిత్స, ఆరోగ్యకరమైన జీవనశైలి, మైనింగ్ సేఫ్టీ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఎస్వోటు జీఎం ఎన్. సత్యనారాయణ, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులు పి. హరిశంకర్ రావు, డాక్టర్ పి. శేషగిరి రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్, డాక్టర్ హుస్సేన్, ఇతర వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం, ఇతర అధికారులు

## గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా వైద్యులు వైద్య సిబ్బందికి శిక్షణ సమీక్ష

బెల్లంపల్లి, డిసెంబర్ 10, ప్రభాతవార్త:

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశానుసారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్. అనిత ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా వైద్యులు, వైద్య సిబ్బందికి శిక్షణ సమీక్ష చేయడం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తాళ్ల గురజాల, నెన్నల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తగు సూచనలు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలలో పాల్గొంటున్న వైద్య శిబిరంలో ఉన్న ఆశ ఆరోగ్య వైద్యులు సమయపాలన పాటించాలని, ఉదయం 6 గంటలకి ఆయా పోలింగ్ కేంద్రాలలో ఫస్ట్ ఎయిడ్ కిట్టులతో అందుబాటులో ఉండాలని, యూనిఫాంలో ఉండాలని, పోలింగ్ కేంద్రాల వద్దకు మొబైల్ ఫోన్లను తీసుకు వెళ్ళరాదని ఆదేశించారు. వైద్య శిబిరంలో ఉన్న మందులను ఎక్స్పైరీ డేట్‌లను చూసి తీసుకొని వెళ్లాలని, తీసుకొని వెళ్తున్న మందుల వివరములను నమోదు చేయాలని, ఎలక్షన్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉన్నందున స్థానిక నాయకులతో గాని పరిచయం ఉన్నవాళ్లతో గాని మాట్లాడడం చేయరాదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇవాంజలి వైద్యాధికారి, నెన్నల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డిపిఓ ప్రశాంతి, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బంది పాల్గొన్నారు. తదుపరి ఫస్ట్ ఎయిడ్ కిట్టులను పంపిణీ చేయడం జరిగింది.



## జైపూర్ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛత పక్వడా

**జైపూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ సిఐఎస్ఎఫ్ అద్వర్యంలో స్వచ్ఛత పక్వడా కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ కమాండెంట్ భరత్ నాయక్ విద్యార్థులతో కలిసి పాఠశాల పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత యొక్క ప్రాధాన్యతను వివరించారు. సామాజిక సేవ కార్యక్రమల్లో విద్యార్థులు పాల్గొనటం ఒక బాధ్యతగా అలమార్చుకోవలని సూచించారు. స్వచ్ఛత పక్వడా కార్యక్రమం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్యాంసుందర్, గోపాల్, సిఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ రావు, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఉమేష్ కుమార్, పదమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో

**లక్షెట్టిపేట, డిసెంబర్ 10, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలంలో నిర్వహించే స్థానిక ఎన్నికల ఏర్పాట్లను ఎంపీడీవో సరోజ పరిశీలించారు. బుధవారం ఆమె పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురువారం మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో స్థానిక ఎన్నికలు జరగనున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది ఉన్నారు.

## సింగరేణి సేవా సమితి నిర్వహించే కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

**మందమర్రి, డిసెంబర్ 10, ప్రభాతవార్త**



మందమర్రి ఏరియాలోని సింతాస్ ఆఫీస్ నందు 25వ సింగరేణి సేవా సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎన్. శ్రీవాణి రాధాకృష్ణ మందమర్రి ఏరియా సేవా అధ్యక్షురాలు విచ్చేసి మొదటగా అందరికీ 25వ సింగరేణి సేవా సమితి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం సేవా అధ్యక్షురాలు మాట్లాడుతూ ఈ యొక్క 25వ సింగరేణి సేవా సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈ సంవత్సరం నా చేతుల మీద జరగడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అలాగే సింగరేణి సంస్థ ఉత్పత్తి ఉత్పాదకతయేకాక ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేస్తుందని అందులో భాగంగా సింగరేణి సేవా సమితి ద్వారా ఎంతోమంది యువతి యువకులకు, మహిళలకు ఎన్నో కార్యక్రమాల ద్వారా వారికి చేయుతనిస్తుందని అన్నారు.అంతేకాకుండా మహిళలకు కుట్టు శిక్షణ, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటిషన్, యువతీ యువకులకు కంప్యూటర్, పోలీస్, ఆర్మీ రిక్రూట్మెంట్ ఇలా ఎన్నో కార్యక్రమాలు చేస్తూ వారి కాళ్లపై వారు నిలబడేలాగా వారి కుటుంబాలకు ఆదాయం వచ్చేలాగా స్వయం ఉపాధి కల్పిస్తుంది అని అన్నారు. అంతేకాకుండా వారు నేర్చుకొని వారు కుట్టిన ప్రతిదీ కూడా ఇంటర్నేషనల్ నాంపల్లి ఎగ్జిబిషన్ హైదరాబాదులో సేల్స్ చేసుకునే విధంగా స్టాల్‌ను కూడా సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిందని అన్నారు. మహిళలందరూ కూడా సింగరేణి సేవా సమితి ద్వారా నిర్వహించే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిఓ శంకర్, లేడీస్ క్లబ్ సెక్రటరీ మనీ, ట్రెజరర్ కవిత, సేవ మెంబర్స్ రజిత, సేవ కోఆర్డినేటర్ నెల్సన్ మరియు లేడీస్ క్లబ్ సభ్యులు, సేవా సభ్యులు, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

# శూన్య ప్రమాదాలే లక్ష్యంగా బొగ్గు ఉత్పత్తి సాధించాలి

### రక్షణ చర్యల్లో రాజీ పడకూడదు : కార్పొరేట్ సేఫ్టీ జీఎం కె. సాయిబాబు

**నస్పూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థలో శూన్య ప్రమాదాలను లక్ష్యంగా పెట్టుకొని ప్రతి విభాగం పనిచేయాలని, రక్షణ చర్యల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని కార్పొరేట్ సేఫ్టీ జనరల్ మేనేజర్ కె. సాయిబాబు అధికారులకు సూచించారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌తో కలిసి ఆయన ఆర్.కె5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా గని కార్యకలాపాలను సమీక్షించి, గని ప్లాన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సీమ్‌లలో అమలు చేస్తున్న రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు మరియు సాంకేతిక పరికరాల వినియోగంపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేట్ సేఫ్టీ జీఎం కె. సాయిబాబు మాట్లాడుతూ.. గనుల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి వ్యక్తిగత రక్షణ పరికరాలు తప్పనిసరిగా ధరించాలని స్పష్టం చేశారు. సేఫ్టీ డ్రిల్స్, మాక్ డ్రిల్స్, గ్యాస్ మానిటరింగ్, హజార్డ్ ఐడెంటిఫికేషన్, రూట్ కాజ్ అనాలిసిస్ వంటి పద్ధతులను క్రమం తప్పకుండా పాటించాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేట్ సేఫ్టీ జీఎం కె. సాయిబాబు

వెంటిలేషన్, సపోర్ట్ సిస్టమ్స్, డస్ట్ సప్రెషన్ సిస్టమ్స్ వంటి కీలక అంశాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలను ముందుగానే అంచనా వేసి నివారించే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. సురక్షితమైన పని వాతావరణం అనేది ఉద్యోగుల నిబద్ధత, పర్యవేక్షణాధికారుల నిరంతర పరిశీలన వల్లే సాధ్యమవుతుందని తెలిపారు.

**లక్ష్యం దిశగా ఆర్.కె 5..**

శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆర్.కె5 గనిలో రక్షణ విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉద్యోగులందరూ రక్షణ పరికరాలు ధరిస్తూ ఉత్పత్తిలో భాగస్వాములవుతున్నారని, ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 2,70,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని తప్పక సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గని ఏజెంట్ శ్రీధర్, గని మేనేజర్ సుధీర్ కుమార్ ఝా, గని రక్షణాధికారి శివయ్య, గని సర్వే అధికారి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ రేప్ కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలు

**నస్పూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త**


మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష పడింది. 2021లో సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 13 ఏళ్ల బాలికను ఫాస్ట్ ఫుడ్ సెంటర్ మాస్టర్ బోరెం సాయి సునీల్ (21) కిడ్నప్ చేసి అత్యాచారం చేశాడు. ఈ కేసును విచారించిన మంచిర్యాల ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస నాయక్ బుధవారం తీర్పు వెలువరించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ ఏ. రాంభావ్ 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి, నిందితుడికి శిక్ష పడేలా బలమైన వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో సాయి సునీల్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 12 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ. 4 లక్షల పరిహారం అందజేయాలని ఆదేశించారు. స్పెషల్ పీపీ డాక్టర్ ఏ. రాంభావ్ వాదనలు, సాక్ష్యాధారాల వల్లే నిందితుడికి శిక్ష పడిందని, ఈ కేసులో ప్రతిభ చూపిన పోలీసు అధికారులను రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

## ఆరు గ్యారంటీలు అమలులో కాంగ్రెస్ విఫలం

### - బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథరావు

**తాండూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :**

గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేరబెల్లి రఘునాథరావు ఆరోపించారు. మండలంలోని ఐబీ బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో మంచిర్యాల జిల్లాలో ఏడు శాతం మాత్రమే బీసీలకు రిజర్వేషన్ కల్పించారని విమర్శించారు. రేవంత్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో బిజెపి బలపరుస్తున్న అభ్యర్థులకు ప్రజలు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కొయ్యల ఏమాజీ, పులగం తిరుపతి, మహిధర్ గౌడ్, శ్రీకృష్ణదేవరాయలు, శేషగిరి, భరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేరబెల్లి రఘునాథరావు



మీ సేవ కేంద్రాన్ని సందర్శించిన ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్

## మీ సేవా నిర్వాహకులు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి

**ఆసిఫాబాద్ / వాంకిడి, డిసెంబర్ 10, ప్రభాతవార్త :**

జిల్లాలోని మీ సేవా కేంద్రాల నిర్వహకులు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ అన్నారు. బుధవారం జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో గల మీ సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రికార్డులు, దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ మాట్లాడుతూ మీ సేవా కేంద్రాల నిర్వహకులు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. దరఖాస్తులను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన సేవా రుసుమును మాత్రమే తీసుకోవాలని తెలిపారు. అధిక ధరలు వసూలు చేసినా, నిబంధనలు ఉల్లంఘించిన మీ సేవా కేంద్రాలపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీ సేవా కేంద్రాల నిర్వాహకులు, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప పడిపూజ

**ఆసిఫాబాద్, డిసెంబర్ 10, ప్రభాతవార్త:**



అయ్యప్ప పడిపూజను స్వాములు వైభవంగా జరుపుకున్నారు. బుధవారం ఆసిఫాబాద్ పట్టణం బాపునగర్లో న్యూ శ్రీ కృష్ణ హోటల్ యజమాని కవాల్కర్ బాబు రావు నివాసంలో గురుస్వామి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్ప స్వామి పడిపూజా కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఇతర స్వాములతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప విగ్రహం వద్ద అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 18 మెట్లపై పడి ముట్టించారు. స్వాములు పాడిన పాటలకు చుట్టూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి స్వాములకు, భక్తులకు బిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో గురుస్వాములు ప్రతాప్, బట్టు సంతోష్, ప్రశాంత్, కిరణ్, వెంకటేష్ గౌడ్, చంద్రమోహన్, మాడావి శ్రీనివాస్, గుండా సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నగర సంకీర్తన నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

# ఎన్నికల విధులను ఆన్‌డ్యూటీగా పరిగణించాలి

**- స్పెషల్ లీవ్‌తో సింగరేణి ఉద్యోగులకు తీవ్ర నష్టం - సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం**

**- ఐఎన్టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు**

నస్పూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం విధులు నిర్వర్తిస్తున్న సింగరేణి ఉద్యోగులకు యాజమాన్యం ఆన్ డ్యూటీకి బదులుగా స్పెషల్ లీవ్ వర్తింపజేయడాన్ని ఐఎన్టీయూసీ తీవ్రంగా ఖండించింది. ఇది ఉద్యోగుల ప్రయోజనాలను దెబ్బతీయడమేనని ఐఎన్టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకర్ రావు మాట్లాడుతూ.. సింగరేణి ఉద్యోగులు ఎన్నికల విధుల్లో భాగంగా దూర ప్రాంతాలకు, రవాణా సౌకర్యాలు సరిగా లేని మారుమూల గ్రామాలకు వెళ్లి ఎంతో శ్రమకోర్చి తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని గుర్తుచేశారు. సాధారణంగా లీవ్ అనేది ఉద్యోగి తన సొంత పనులు లేదా వ్యక్తిగత అవసరాల కోసం విధులకు గైర్హాజరైనప్పుడు వినియోగించుకుంటారని తెలిపారు. కానీ, యాజమాన్యం, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల విధులకు వెళ్తున్న ఉద్యోగులకు స్పెషల్ లీవ్ ఇవ్వడం ఏంటని ఆయన ప్రశ్నించారు.



బాధ్యతాయుతమైన విధుల్లో ఉన్నవారిని సెలవులో ఉన్నట్లుగా పరిగణించడం సరైన విధానం కాదని హితవు పలికారు. స్పెషల్ లీవ్ విధానం వల్ల ఉద్యోగులు అనేక విధాలుగా నష్టపోతున్నారని ఆయన వివరించారు. ప్రధానంగా ఈ రోజులను వార్షిక హాజరులో పరిగణించకపోవడం వల్ల, ఉద్యోగులు భవిష్యత్తులో పొందాల్సిన ఆర్జిత లీవుల పై కోత పడుతోందన్నారు. అలాగే విధుల్లో ఉన్నప్పుడు వచ్చే అలవెన్సులు, కంపెనీ ఇచ్చే ప్రోత్సాహక ఇన్సెంటివ్‌లు కోల్పోవడంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌ను ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ బి. జనక్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినట్లు శంకర్ రావు తెలిపారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన జనక్ ప్రసాద్, వెంటనే సింగరేణి సంస్థ చైర్మన్, సంబంధిత మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చించనున్నట్లు తెలిపారన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగికీ ఆన్ డ్యూటీ వర్తింపజేసి, వారికి ఎటువంటి ఆర్థిక నష్టం కలగకుండా చూసేందుకు ఐఎన్టీయూసీ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## వైభవంగా అయ్యప్ప స్వామి నగర సంకీర్త

తాండూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఐబీలో బుధవారం అయ్యప్ప స్వాములు నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐబిలోని శ్రీ భక్త ఆంజనేయ దేవాలయం నుండి జాతీయ రహదారి మీదుగా తంగళ్ళపల్లి శ్రీ ఆంజనేయస్వామి, కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు కొనసాగింది. మళ్లీ అక్కడి నుండి ఐబి ఆంజనేయస్వామి ఆలయం వరకు అయ్యప్ప స్వాములు వినాయకుడు, సుబ్రహ్మణ్యం అయ్యప్ప స్వామి ఉత్సవం మూర్తులు చిత్రపటాలతో దైవ నామస్మరణ, భజన చేస్తూ నగర సంకీర్తన నిర్వహించారు. మహిళలు భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు. అయ్యప్ప నామస్మరణ, భజన కీర్తనలతో మారుమోగాయి.



అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఓ శ్రీనివాస్

## ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులకు అవగాహన

ఆసిఫాబాద్, డిసెంబర్ 10, ప్రభాతవార్త

రెండవ సాధారణ ఎన్నికలు 2025లో భాగంగా ఆసిఫాబాద్ మండల పరిధిలోని 27 గ్రామ పంచాయతీలకు జరుగుచున్న సర్పంచ్, వార్డ్ సభ్యుల పదవులకు పోటీ చేయుచున్న అభ్యర్థులకు ఎన్నికల నియమావళిపై ఆసిఫాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి, అసిస్టెంట్ ఎలక్షన్ అబ్జర్వర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఎంపిడిఓ ఆధ్వర్యంలో పోటీ చేయుచున్న అభ్యర్థులకు లెక్కలు సమర్పించు విధానంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ ఎం. శంకరయ్య, అకౌంటింగ్ టీమ్ కే.దీపిక, సర్పంచ్, వార్డ్ అభ్యర్థులు పాల్గొన్నారు.

## అనిల్ అన్నతోడు ఏకగ్రీవాల జోరు..

నేరడిగొండ, డిసెంబర్ 10, ప్రభాతవార్త:

బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఏకగ్రీవ సర్పంచ్ ఎన్నికల జోరు కొనసాగుతోంది. కేసీఆర్ పాలన మళ్లీ రావాలని పల్లెల ఆత్మీయ అభిలాష ప్రతిఫలిస్తుందని స్థానిక నాయకులు పేర్కొన్నారు. కుంటాల(కే) గ్రామ పంచాయతీ సర్పంచ్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ రాథోడ్ సావిత్రి ప్రేమ్సింగ్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు చీటి రాజు, ఎల్లుల లలిత, పులడి నవీన, బంక సరిత, శ్రీనివాస్ రాథోడ్, ఆడే ప్రేమ్ సింగ్, బట్టు స్వప్న, ఆడే సవితలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కుంటాల(కే) సర్పంచ్, వార్డు సభ్యులు బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వంగా కలిసిశారు. ఎమ్మెల్యే వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ పల్లెలు ఐక్యంగా నిలబడి ఏకగ్రీవానికి అంగీకరించడం అభినందనీయం అన్నారు. గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి ఎప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



## గెలిస్తే సర్పంచి.. ఓడితే వార్డు మెంబర్

కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :



సర్పంచి బరిలో వార్డు సభ్యురాలు పోటీకి దిగారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం చింతగూడ కోయవాగు సర్పంచి స్థానం ఎస్టి మహిళకు రిజర్వు కావడంతో గ్రామానికి చెందిన చింతపురి లక్ష్మి పోటీలో నిలిచారు. దాంతో పాటు 11వ వార్డుకు సైతం ఆమె నామినేషన్ వేశారు. ఆ వార్డుకు ఒక్క నామినేషను రాకపోవడంతో లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పుడు సర్పంచి స్థానానికి తన అదృష్టం పరీక్షి ంచుకుంటున్నారు. అక్కడ ఆమెకు మరొకరు పోటీపడుతున్నారు. సర్పంచ్‌గా గెలిస్తే 15 రోజుల్లో వార్డు స్థానానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది.

## పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**- ఎంపిడిఓ ఆల్బర్ట్**

పెంచికల్ పేట్, ప్రభాతవార్త:

అర్హత ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఎంపిడిఓ ఆల్బర్ట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఓటు ఎంతో ముఖ్యమైందని, ఎన్నికల బాధ్యతల వలన పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును నమోదు చేయాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ నమోదు కోసం ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ కాపీ, ఓటర్ ఐడి లేదా ఆధార్ కార్డుతో సంబంధిత ఎన్నికల కార్యాలయంలో ఈ నెల 11, 12 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ ఓటు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు.



## బాధిత కుటుంబానికి పరామర్శ

నేరడిగొండ, డిసెంబర్ 10, ప్రభాతవార్త:

మండలంలోని లఖంపూర్ గ్రామానికి చెందిన గౌస్ ఉద్దీన్ ఇటీవలే అనారోగ్యాంతో స్వర్గియూలైనా విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## మందమర్రిలో మానవ హక్కుల అవగాహనకై పాఠశాల విద్యార్థులచే ర్యాలీ

మందమర్రి, డిసెంబర్ 10, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలో బుధవారం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మథర్ తెరిసా పాఠశాల విద్యార్థులచే మానవ హక్కుల పై అవగాహన కలిగించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ మహిళా మదర్ థెరిసా ఎడ్యుకేషనల్ సొసైటీ సర్వీస్ సెక్యూరిటీ మందమర్రి కే. భువనేశ్వరి ప్రిన్సిపల్ ఎన్జీవో మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు సమాజంలో స్వేచ్ఛ స్వాతంత్ర్యాలతో జీవించడానికి హక్కులను విధులను ఏర్పాటు చేయడం జరిగిందని, మానవ హక్కులను మనమంతా తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని, కుల మత భేదాలు లేకుండా సమానత్వంగా జీవించడానికి మానవ హక్కుల గురించి విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. రాజ్యాంగం మనకు హక్కులతో పాటు విధులను కూడా ఏర్పాటు చేసిందని వాటిని అనుసరిస్తూ రాజ్యాంగబద్ధంగా విధానం ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలపై అవగాహన


వేమనపల్లి, ప్రభాతవార్త



నీల్వాయి రైతు వేదికలో ఎన్నికల వ్యయ పరిశీలకులు శోభారాణి ఆధ్వర్యంలో ఎంపీడీవో కుమారస్వామితో కలిసి ఎన్నికలలో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల ఖర్చులు, మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ పైన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలన అధికారి మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు ఖచ్చితంగా ఎన్నికల ఖర్చులను మండల ఎన్నికల నిర్వహణ అధికారికి సమర్పించాలని సూచించారు. సర్పంచ్ పోటీ చేసే అభ్యర్థులు లక్ష యాభై వేలు, వార్డు సభ్యులు ముప్పై వేలు ఖర్చులు చేయడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ అనుమతినిచ్చిందన్నారు. ఎన్నికల్లో ఖర్చులు సమర్పించని అభ్యర్థులు పోటీకి అనర్హుడిగా ప్రకటిస్తామని పేర్కొన్నారు. ప్రచారం చేసే అభ్యర్థులు చర్చ్, మసీదు, గుడిలో ప్రచారం చేయకూడదని తెలియజేశారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేని యాభై వేల రూపాయల కంటే అధికంగా ఉంటే అలాంటి డబ్బులను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ మష్కూర్ అలీ, సహాయ వ్యయ పరిశీలకులు పొగాకు శ్రీనివాస్, పాల్గొన్నారు.

# మెరిసిన కాసిపేట 2 ఇంక్లైన్ గని

### ✦ ఘనంగా 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు
### ✦ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి ఉత్పదకత సాధించాలి
### ✦ రక్షణ బృంద కన్వీనర్ విజయ్‌ప్రసాద్




**కాసిపేట, డిసెంబర్ 10, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియాలోని కాసిపేట టూ ఇంక్లైన్ గనిలో బుధవారం రోజున ఘనంగా 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు నిర్వహించుకోవడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఏరియాలో పర్యటిస్తున్న రక్షణ బృందాన్ని కాసిపేట టూ ఇంక్లైన్ గని అధికారులు, కార్మికులు ఘనంగా స్వాగతం పలికారు. తధానంతరం గని పరిసర సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమం గని మేనేజర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఈ వార్షికంలో గనికి విధించినటువంటి లక్ష్యాన్ని సాధించడానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్లు ప్రస్తుతం గత సంవత్సరంలో ఉన్న 59 శాతము ఉత్పత్తిని, 73 శాతానికి గణనీయంగా సాధించినట్లు మేనేజర్ పేర్కొన్నారు. రక్షణతో కూడుకున్న ఉత్పత్తి సాధించడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. గనిలో జరుగుతున్న ఉత్పత్తి, రక్షణ చర్యలను రక్షణ బృందానికి తెలపడం జరిగింది.



రక్షణ కమిటీ సభ్యుడిని సన్మానిస్తున్న దృశ్యం



## మానవ తప్పిదం ఆ సురక్ష పద్ధతి వల్లే ప్రమాదాలు

**- మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ**



కార్మికులు రక్షణతో కూడుకున్న ఉత్పత్తి సాధించడమే కంపెనీ లక్ష్యమని ఆన్ సేఫ్ యాక్ట్, ఆన్ సేఫ్ ప్రాక్టీస్ వలనే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పనిచేసేటప్పుడు అప్రమత్తతో ఉండాలని ఆయన అన్నారు. సింగరేణి తల్లి ఎప్పుడు కూడా ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తి మాత్రమే కోరుకుంటుంది అని అన్నారు.

## ప్రతి పనిలో రక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- జీఎం హెచ్‌ఆర్డి బృంద కన్వీనర్ విజయ్‌ప్రసాద్**



ఎవరి రక్షణ వారి బాధ్యత ఇంటి నుంచి విధి నిర్వహణకు బయలుదేరేటప్పటి నుండే రక్షణ మొదలవుతుందని ప్రతి ఒక్కరు హెల్మెట్ తూచా తప్పకుండా వాడాలని స్వీయ రక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కార్మికులకు సూచించారు. కార్మికులకు గని లోపల మాత్రమే రక్షణ కాదు బయట కూడా రక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్మికులు ఆరోగ్యానికి కాపాడుకోవాలని తెలపడం జరిగింది.

## ప్రతి కార్మికుడు ఎస్ఎంపి, ఎస్ఓపి ప్రకారం పని చేయాలి

**- మందమర్రి ఏరియా ఏజెంట్ రాంబాబు**



ప్రతి కార్మికుడు విధి నిర్వహణలో ఎస్ఎంపి, ఎస్ఓపి ప్రకారం పని చేయాలని సూచించారు. పనిలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదాలు ప్రకృతి వైపరీత్యం, మానవ తప్పిదం వల్లే జరిగే అవకాశం ఉంటుందని అన్నారు. మందమర్రి ఏరియా జీఎం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రత్యేకంగా ప్రశంసించారు. అధికారుల ఉపన్యాసం అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్మికులకు అధికారులు బహుమతులను ప్రదానం చేశారు.



రక్షణ బృందానికి స్వాగతం పలుకుతున్న దృశ్యం



గని సందర్శనకు వెళ్తున్న రక్షణ బృందం

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమం..

ఈ కార్యక్రమంలో భాగంగా కార్మికులను రక్షణ పట్ల అప్రమత్తం చేయడం కోసం నాట్యం, నాటిక నిర్వహించారు. కార్మికులు అందరూ ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం గనిలో చేపడుతున్నటువంటి రక్షణ విధానంపై బృందం పర్యటించడం జరిగింది. రక్షణ పట్ల చేపడుతున్న విధానంపై సపోర్ట్ మ్యాన్, ఎస్ డి ఎల్ ఆపరేటర్, కోల్ కట్టర్, ట్రమ్మర్ లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రక్షణ పట్ల కార్మికులకు ఉన్న అవగాహనను ప్రశ్నించారు.

ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, అధికారులు డివై జి.యం డైరెక్టర్ (ఒపి) రవీందర్, మందమర్రి ఏరియా ఏఎస్ఓ భూ శంకరయ్య, శివకుమార్, శైలేంద్ర కుమార్, రమేష్, కమారుద్దీన్, పోషమల్లు, రాజ లింగయ్య, శ్రీనివాస్, కిరణ్, కాసిపేట టూ ఇంక్లైన్ గని నుండి వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్, రక్షణ అధికారి రవిశంకర్, అసిస్టెంట్ మేనేజర్ కృష్ణ ప్రసాద్, మైన్ పిట్ ఇంజనీర్ రఘు, డిప్యూటీ మేనేజర్ దిలీప్ కుమార్, వర్క్‌మెన్ ఇన్స్‌పెక్టర్ కృష్ణచారి, ఓవర్ మేన్ రఘు, శ్రీకాంత్, శ్రీనివాస్, గని పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, కార్మిక ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.





కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

# పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో నేడు సెలవు

## - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, డిసెంబర్ 10, ప్రభాతవార్త:**

రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలింగ్ కార్యచరణ ప్రకారం సెలవులు ఖరారు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు పోలింగ్ రోజు ప్రభుత్వ సెలవుగా ప్రకటించడం జరిగిందని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనుకునే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, సేవల అత్యవసరతకు లోబడి ఆ రోజు కార్యాలయానికి ఆలస్యంగా హాజరు కావడం, కార్యాలయం నుండి త్వరగా వెళ్లడం, తక్కువ వ్యవధి గైర్హాజరు విధానాన్ని ఉపయోగించుకునే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ఎన్నికల కోసం ఉపయోగించబోయే ప్రజా, విద్యా సంస్థల భవనాలు, ఇతర భవనాలకు పోలింగ్ రోజు ప్రభుత్వ సెలవు, పోలింగ్ రోజుకు ముందు రోజు స్థానిక సెలవుగా పరిగణించబడుతుందని తెలిపారు. జిల్లాలో 3 విడతలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగునున్న నేపథ్యంలో మొదటి విడతగా ఈ నెల 11వ తేదీన ఎంపిక చేయబడిన ప్రాంతాలలో స్థానిక సెలవు ప్రకటించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ రోజుకు ముందు రోజు ఈ నెల 10వ తేదీ, పోలింగ్ రోజున ఈ నెల 11నజిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు స్థానిక సెలవు దినంగా ప్రకటించబడిందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ అండర్ టేకింగ్స్, వాణిజ్య, పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలు వేతనంతో కూడిన సెలవు దినాలుగా ప్రకటించాలని తెలిపారు.



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



## రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ఉపాధ్యాక్షురాలుకు ఆహ్వానం పత్రిక అందజేత

**సారంగాపూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త:**

నిర్మల్‌లో రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ఉప అధ్యక్షురాలు అల్లూరి కృష్ణ వేణికి నిర్మల్ జిల్లాలోనీ పురాతన బంగల్ పేట్ శ్రీ మహాలక్ష్మి ్మ అమ్మవారి 3 వ వార్షికోత్సవ ఆహ్వానం పత్రికను బుధవారం అందజేశారు. వార్షికొత్సవానికి తప్పకుండా హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మెన్ కుడకల శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ నెల 15న వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని, అమ్మవారికి ప్రత్యేక పూజలు అన్నదానం చేపడుతున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు పెండం శ్రీనివాస్, నరేష్ గౌడ్, జిందం సన్నీ తదితరులు పాల్గొన్నారు.



వెబ్ కాస్టింగ్ నిర్వహణను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## వెబ్ కాస్టింగ్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

### - మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్


**నస్పూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త**

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నేడు జరగనున్న మొదటి విడత పోలింగ్‌లో భాగంగా వెబ్ కాస్టింగ్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వెబ్ కాస్టింగ్ నిర్వహణను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరుగనున్న పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో గుర్తించిన 24 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షి ంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### - ఎస్సీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్‌కు ఐఎఫ్‌టీయూ మెమోరండం

**నస్పూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు డి. బ్రహ్మానందం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కంటిన్యూయేషన్ ఆర్డర్ సాకుతో ట్రెజరీలో బిల్లులు ఆగిపోయాయని, ఫైనాన్స్ శాఖలో ఫైల్ పెండింగ్‌లో ఉందని అధికారులు చెబుతూ కాలయాపన చేయడం వల్ల కార్మికులు ఆర్థికంగా చితికిపోతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు రాజన్న, సంపత్, రాజేశ్వరి, శారద, కవిత, లక్ష్మి, శ్యామల, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చోడలో సిపిఐ ప్రచార జోరు.. సభ్యుల విజయానికి పిలుపు

**ఇచ్చోడ, డిసెంబర్ 10, ప్రభాతవార్త:**



ఇచ్చోడ మండలం, గ్రామం పరిధిలో సిపిఐ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్ విలాస్ పిలుపునిచ్చారు. బుధవారం ఇచ్చోడ గ్రామంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎస్కే ఉస్మాన్ తో కలిసి సిపిఐ వార్డు సభ్యుల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ విలాస్ మాట్లాడుతూ ఇచ్చోడ గ్రామంలో వార్డ్ నెంబర్ 14 నుంచి పోటీ చేస్తున్న జిల్లా సిపిఐ కౌన్సిల్ సభ్యులు కల్లేపల్లి గంగయ్యతో పాటు వార్డ్ నెంబర్ 1, 12, 7, 11 స్థానాల్లో, నర్సాపూర్ వార్డ్ నెంబర్ 3, గీర్థం వార్డ్ నెంబర్ 2, సిరిచెల్మ, దుబ్బర్పేట్, అడగామా(కే)లో వార్డ్ నెంబర్ 1, 2 స్థానాలలో సిపిఐ అభ్యర్థులు రంగంలో ఉన్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. వీరిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి ప్రచారం చేశారు. ప్రజలు సిపిఐ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్యల లక్ష్మణ్, అన్నెల పెద్ద లక్ష్మణ్, మేడపాట్ల గంగన్న, రవి మేస్త్రీ, ఆర్ రాందాస్, జె దినేష్కుమార్, ఏ దత్తు, మచ్చరమే నరేష్, కల్లెపల్లి నరేష్, నాగమ్మ, మరియమ్మ, దుబ్బాక ఆడేలు పాల్గొన్నారు.


## ఘనంగా సీతారాంపల్లి టిజిబి శాఖ 41వ వార్షికోత్సవం

### - డిపాజిట్లపై అధిక వడ్డీ, బీమా సేవలు వినియోగించుకోవాలి

### - రీజినల్ మేనేజర్ బాలచంద్ర పట్కి

**నస్పూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త**

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీతారాంపల్లి శాఖ 41 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం శాఖ కార్యాలయంలో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంచిర్యాల రీజినల్ మేనేజర్ బాలచంద్ర పట్కి మాట్లాడుతూ.. సీతారాంపల్లి శాఖ 41 ఏళ్లుగా ఖాతాదారుల మన్ననలు పొందుతూ విజయవంతంగా ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కెల్లా టిజిబిలోనే ప్రస్తుతం డిపాజిట్లపై అత్యధిక వడ్డీ లభిస్తోందన్నారు. ఖాతాదారులు వ్యవసాయ, గృహ, బంగారు రుణాలతో పాటు, బ్యాంకు అందించే ఇన్సూరెన్స్, పెన్షన్ పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. బ్యాంకు ద్వారా ఇన్సూరెన్స్ చేసుకున్న వారికి ఆపద సమయంలో అండగా నిలుస్తున్నామని, ఇటీవల ఒక బాధిత కుటుంబానికి రూ. 10.27 లక్షల క్లెయిమ్, మరొకరికి హెల్త్ ఇన్సూరెన్స్ పరిహారం అందజేశామని గుర్తుచేశారు. శాఖా మేనేజర్ నరసింహా స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మెప్మా అధికారి నాగరాజు, సిబ్బంది, పలువురు ఖాతాదారులు పాల్గొని, శాఖ సేవలను కొనియాడారు.






## పండుగ సాయన్నకు నివాళులు

**సారంగాపూర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో దళిత బహుజన ఐక్యవేదిక అధ్యక్షుడు సాయన్న ఆధ్వర్యంలో పండుగ సాయన్న వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బీసీ నాయకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పండుగ సాయన్న బహుజన బిడ్డల కోసం నిజాం భూస్వాముల నిరంకుశత్వాన్ని వ్యతిరేకించి పోరాడిన వ్యక్తి అని ఆ రోజుల్లో భూస్వాములు అధిక పన్నులు వసూలు చేసి దళితులను, వెనుకబడిన వర్గాల వారిని హింసించి పన్నులు వసూలు చేసినారని వారిని వ్యతిరేకించి భూస్వాముల దగ్గర నుండి ధాన్యాన్ని దోచుకొని పేద ప్రజలకు పంచినటువంటి ప్రజా పోరాట యోధున్ని నిజాం పట్టుకొని ఉరి తీశారని గుర్తుచేశారు. ప్రజా పోరాటయోధునిగా చరిత్రలో నిలిచిపోయాడు అని తెలిపారు. అతని మరణాన్ని చింతిస్తూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ నాయకుడు అర్ధాంగి కృష్ణ నిర్వాణం

### - కుటుంబాన్ని పరామర్శించిన పార్టీ నాయకులు

**ఆదిలాబాద్, ప్రభాతవార్త:**



సిపిఐ సీనియర్ నాయకులు అర్ధాంగి కృష్ణ మరణంపై పార్టీ నాయకత్వం సానుభూతి తెలిపింది. బుధవారం తాంసి మండలం గోట్కూరి గ్రామంలోని అర్ధాంగి కృష్ణ కుటుంబాన్ని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు, మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ముడుపు నలినిరెడ్డి, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్రెడ్డి కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులు, వారి కుమారులు, సతీమణితో మాట్లాడి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమంలో దాదాపు 55 సంవత్సరాల పాటు అంకితభావంతో సిపిఐకి సేవచేసిన అర్ధాంగి కృష్ణ వంటివారిని కోల్పోవడం పార్టీకి, గోట్కూరి గ్రామం, తాంసి మండలానికి తీరని లోటు అని అన్నారు. ఆయన ఆశయాల దిశగా కుటుంబ సభ్యులు ముందుకు సాగాలని సూచించారు. అర్ధాంగి కృష్ణ పెద్ద కుమారుడు అద్దంకి రమేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుగా, తాంసి మండల కార్యదర్శిగా కొనసాగుతున్న విషయం నాయకులు గుర్తు చేశారు. ఆయన తండ్రి అడుగుజాడల్లో నడవాలని కుటుంబానికి సూచించారు. కిష్టన్న కుటుంబానికి సిపిఐ జిల్లా నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కిష్టన్నలాంటి సంకల్పబలం ఉన్న నేతలు అరుదు, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని కమ్యూనిస్టులు నడవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.